క్లుప్తంగా

కూలీలకు ఉపాధి కల్పించాలి

ఇంద్రవెల్లి: ప్రతీ ఒక్క కూలీకి ఉపాధి కల్పించాలని ఎంపీడీవో భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశమయ్యారు. ముందుగా గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులు, పని చేస్తున్న కూలీల సంఖ్య, సమస్యలు, తాగునీటి సమస్యలను పంచాయతీ కార్యదర్శులకు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో ధర్మ జీవాన్, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పర్యటించాలి

నేరడిగొండ: పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా పంచాయతీల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నర్సరీలు, పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ కశ్యప్ అన్నారు. రాష్ట్రీయ బాల్ స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోవ విఠల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణరెడ్డి, ఫజల్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఇచ్చోడ: ఉపాధి పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండలంలోని కోకస్‌మన్నూర్‌లో ఉపాధి పనులను పరిశీలించారు. ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్ సుభాష్, కూలీలతో మాట్లాడారు. పనులు వేగవంతంగా చేయాలని సూచించారు. వందశాతం కూలీలు పనులకు హాజరయ్యే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. ఎండలు ఉన్నందున వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సన్మానం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన భాస్కర్‌ను సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోబాబాయి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, మీర్జ జీలానిబేగ్, కోవ రాజేశ్వర్, కొరెంగా సుంకట్‌రావ్, సుఫీయన్, మెస్రం తుకారం, కనక హనుమంత్‌రావ్, పోటే సాయినాథ్ పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

కైలాస్‌నగర్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి ఈనెల 20న జైనథ్ మండల కేంద్రంలో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించనున్నట్లు డీఆర్‌డీవో సాయన్న తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసే ప్రజావేదికలో తనిఖీ నిర్వహించనున్నట్లుగా వెల్లడించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు నేరడిగొండ మండలంలోని బోరిగామ గ్రామంలో క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. అనంతరం 11 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు.

విరాళం అందజేత

జైనథ్: మండలంలోని సాంగ్వి(కె) గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో టైల్స్, కలరింగ్ కోసం స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ. 40వేల విరాళాన్ని అందించారు. సోమవారం సంస్థ ప్రతినిధులు పాఠశాలకు వెళ్లి, ఉపాధ్యాయుడు నారాయణకు నగదు అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పవన్, పీఆర్ హెడ్ శివసాయి, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రతినిధులు నిఖిల్, రిషికేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

బోథ్: గతంలో దేశ వ్యాప్తంగా రైతుల ధర్నాకు దిగివచ్చిన మోదీ మూడు నల్ల చట్టాలను రద్దు చేయడం జరిగిందని, రైతులకు మద్దతు ధర చట్టాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చి నేటికీ నెరవేర్చలేదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. రైతులు చేస్తున్న ఉద్యమాన్ని వక్రీకరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, దాస్, రాములు, నరేశ్, ప్రేమ్, సుమేర్ పాషా పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి

- నివాళులర్పించిన నాయకులు
- పలు గ్రామాల్లో శోభాయాత్రలు



సిరికొండ: శివాజీ జయంతిలో పాల్గొన్న నాయకులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్ లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. బీజేపీ నాయకులు లాలా మున్న, జోగు రవి, దశరథ్ పటేల్, రమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవేనగర్‌లో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే జిల్లా కేంద్రంలోని శివాజీ చౌక్‌లో శివాజీ విగ్రహానికి సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి నివాళులర్పించారు.

బేల: మండల కేంద్రంతో పాటు చప్రాల, అవాల్‌పూర్ గ్రామాల్లో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించారు. శివాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బేలలో మరాఠ సంక్షేమ సంఘం, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

సిరికొండ: మండల కేంద్రంతో పాటు పోన్న, రాంపూర్, జాకీర్‌గూడ, సోన్‌పెల్లి గ్రామాల్లో శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. పోన్న గ్రామంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

నేరడిగొండ: మండల కేంద్రంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించారు. ధర్మానికి మారుపేరు, విజయానికి చిహ్నం, వీరుడనే పేరును సార్థకం చేసుకున్న యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో బలరాం జాదవ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. మండలంలోని తన్యానాయక్ తండా ర్యాలీలో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండల కేంద్రంలో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద గల శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆరె మరాఠ అధ్యక్షుడు విట్టల్, రాజారాం, కదం ప్రశాంత్, గోర్ల రాజు యాదవ్, కట్ట భూమేష్, మెరుగు గంగాధర్, జక్కుల వెంకటేశ్ పాల్గొన్నారు.

జైనథ్: మరాఠ సంఘం నాయకులు మండల కేంద్రంతో పాటు నిరాల, సావాపూర్, బాలాపూర్ గ్రామాల్లో శివాజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. శివాజీ మహరాజ్‌ను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంతో శ్యాంపూర్, పులిమడుగు, హస్నాపూర్ గ్రామాల్లో శివాజీ జయంతిని నిర్వహించాఉ. మండల కేంద్రంలోని శివాజీచౌక్‌లో ధ్వజారోహణ చేసి ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, అరికిల్ల అశోక్, కొండేరి రమేశ్, గోపాల్ పాల్గొన్నారు.



తాంసి: పిప్పల్‌కోటి పాఠశాలలో..

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పిప్పల్ కోటి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు శివాజీ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్, ఉపాధ్యాయులు శంకర్, సంధ్య, వికేష్, రమేశ్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఎదుట శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పోటే శోబాబాయి, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, మారుతి డోంగ్రె, తహారే గణేష్, దేవ్‌పూజే మారుతి, తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌రూరల్: మాట్లాడుతున్న జనార్దన్ రాథోడ్



జైనథ్: నిరాలలో..



ఆదిలాబాద్: పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే శంకర్



బేల: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌టౌన్: పూలమాల వేస్తున్న జోగు రామన్న



బోథ్: నివాళులర్పిస్తున్న నాయకులు



నేరడిగొండ: నృత్యాలు చేస్తున్న యువకులు



ఇంద్రవెల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

కరాటేలో విద్యార్థినుల ప్రతిభ

బోథ్: బెల్లంపల్లిలో జరిగిన కరాటే పోటీల్లో బోథ్ మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 16 మంది విద్యార్థులు పోటీలో పాల్గొని 6 స్వర్ణ, 6 రజత, 4 కాంస్య పతకాలు సాధించారు. వీరిని పాఠశాల ప్రత్యేకాధికారి రాథోడ్ వనిత, పీఈటీ పుష్పలత, కరాటే మాస్టర్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మైనార్టీకి ఇవ్వాలి'

బోథ్: బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని మైనార్టీకి ఇవ్వాలని రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షుడు షేక్ రజియా బేగం కోరారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ.. నూతనంగా నియమించే మార్కెట్ కమిటీ చైర్మన్‌లలో బోథ్ నియోజకవర్గంలో కనీసం ఒక్కటైనా మైనార్టీకి కేటాయించాలన్నారు.

సైకిల్ యాత్ర చేయడం అభినందనీయం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలం నుంచి అయోధ్యకు యాత్ర చేయడం అభినందనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ముచ్చ స్వామి, తెలుగు అధ్యాపకురాలు జాదవ్ సంగీత అన్నారు. సోమవారం కళాశాలలో సైకిల్‌యాత్ర చేసి వచ్చిన విద్యార్థి సచిన్‌ను ఘనంగా సన్మానించారు. గత నెల 22న ఉత్తరప్రదేశ్ అయోధ్యకు క్షేమంగా వెళ్లి, బాల రాముడు దర్శనం చేసుకుని రావడంతో ఎంతో సంతోషకమన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ జెడ్పీ సమావేశం

తలమడుగు: విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే ప్రజా సమస్యలపై అవగాహన కల్పించేందుకు సోమవారం మండలంలోని ఖోడద్ జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు మాక్ జెడ్పీ సమావేశం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సంభాషణ ఏవిధంగా ఉంటుందో వివరించారు. మాక్ సమావేశంలో సమక్క సారక్క జాతరపై సమీక్ష నిర్వహించారు. జాతరలో భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణకుమారి, ఉపాధ్యాయులు సుకుమర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పని కల్పించడంలో ఎందుకింత నిర్లక్ష్యం?

- అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు
- అధికారుల తీరుపై ఆగ్రహం

తలమడుగు: ఉపాధిహామీ పథకంలో కూలీలకు పని కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు అధికారులపై మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి కార్యాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పథకాన్ని ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 10వేల జాబ్‌కార్డులు ఉండగా.. వెయ్యి మంది కూలీలు మాత్రమే పనులు హాజరవుతున్నారంటే మీపనితీరు ఏవిధంగా ఉందో అర్థమవుతుందని మండిపడ్డారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలించి, కూలీలకు పని కల్పించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో నర్సరీ, సుంకిడి నర్సరీలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మేఘమాల, సిబ్బంది, స్వామి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో కుటుంబరావు

'హామీలు అమలు చేయాలి'

ఇచ్చోడ: ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయాలని ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 2లక్షల రుణమాఫీ, రూ. 4 వేల పెన్షన్, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు ఇస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా.. ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారాక్ పథకాల లబ్ధిదారులకు అదనంగా తులం బంగారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, గాడ్గే సుభాష్, పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

దశల వారీగా ఆరు గ్యారంటీలు అమలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను దశల వారీగా అమలు చేస్తుందని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని భీంసరి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ, బిక్కి గంగాధర్, గిమ్మ సంతోష్, బాయిన్‌వార్ గంగారెడ్డి, భరత్ వాగ్మరే, కోరేటి కిషన్, వసంత్, అంబదాస్, హన్మాండ్లు, దయాకర్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న అడ్డి భోజారెడ్డి

బాధిత కుటుంబానికి సరుకులు అందజేత

ఉట్నూర్‌రూరల్: మండలంలోని కామాయిపేట పంచాయతీ పరిధిలోని ఆలిగూడ గ్రామంలో మడావి చందు ఇల్లు రెండు రోజుల క్రితం దగ్ధం అయింది. విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్థానిక నాయకులకు సమాచారం అందించి తక్షణ సాయం కింద బాధితులకు నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, డీసీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య, లాజర్, షేక్ సలీం, మడావి భీంరావు, ఉమేశ్, దావూద్ పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడమే ధ్యేయం..

పేదల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ ముఖ్య ఉద్దేశమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, కలీం పాషా, తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న నాయకులు

వేరుశనగ సాగుపై ఆసక్తి



వడ్డాడి శివారులో సాగు చేసిన వేరుశనగ

- మండల వ్యాప్తంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- ప్రస్తుతం ఆశాజనకంగా పంట
- దిగుబడిపైన రైతుల ఆశలు

తాంసి: యాసంగిలో రైతులు వేరుశనగ పంటను అధికంగా సాగు చేస్తున్నారు.

మండలంలోని పలు గ్రామాల రైతులు రెండో పంటగా గత రెండేళ్లుగా జొన్న సాగు చేశారు. ఈఏడాది వేరుశనగ పంటను సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. నాలుగేళ్ల క్రితం వేరుశనగ దిగుబడి సరిగా రాక, గిట్టుబాటు ధర లేక తీవ్ర నష్టపోయారు. దీంతో సాగును తగ్గించారు. గత ఏడాది నుంచి దిగుబడి పెరగడంతో వేరుశనగ సాగు చేసేందుకు ఆసక్తి చూపారు. మార్కెట్‌లో సైతం మంచి డిమాండ్ ఉండడం, ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండల వ్యాప్తంగా ఆరువందల ఎకరాల్లో..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండల వ్యాప్తంగా వ్యవసాయాధికారుల ప్రకారం పలు గ్రామాల్లో సమారు 600 ఎకరాలకు పైగా పంట సాగులో ఉంది. ప్రధానంగా తాంసి మండలంలోని వడ్డాడి, పొన్నారి, కప్పర్ల గ్రామాల శివారులో అధికంగా సాగు చేస్తున్నారు. అలాగే భీంపూర్ మండలంలోని అంతర్గాం, వడూర్, గోముత్రి, ధనోర, గోన గ్రామాల్లో సైతం సాగు చేస్తున్నారు. వేరుశనగ సాగుకు గతేడాది అనుకూలంగా వాతావరణం ఉండడం, అధిక దిగుబడి రావడంతో రైతులు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పంటకు తెగుళ్ల సోకకుండా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు.

నాలుగేకరాల్లో సాగు చేశా



ఈఏడాది మత్తడివాగు ఆయకట్టు కింద నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశాను. గత ఏడాది జొన్న పంట సాగుచేస్తే సరైన దిగుబడి రాలేదు. వేరుశనగ సాగు చేసిన రైతుల చేన్లకు వచ్చి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పంట బాగానే ఉంది.

– బెండే లక్ష్మణ్, వడ్డాడి

లాభాలు వచ్చాయి



గత ఏడాది నాలుగు ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తే ఖర్చులు పోను మొత్తం రూ.2 లక్షల వరకు మిగిలాయి. మరింత సాగు విస్తీర్ణం పెంచి ఆరు ఎకరాల్లో వేరుశనగ వేశాను. గత ఏడాది సాగుచేసిన పంటను వ్యాపారులు పంటచేలకు వచ్చి క్వింటాలుకు రూ.6700 చెల్లించి తీసుకెళ్లారు.

– సోమ ప్రవీణ్ రెడ్డి, రైతు, తాంసి

రైతులకు సూచనలిస్తున్నాం

వేరుశనగ సాగు చేసిన రైతులకు వ్యవసాయ శాఖ తరఫున సాగులో సలహాలు, సూచనలు ఇస్తున్నాం. పంట దిగుబడి రావడానికి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు సైతం తెలియజేశాం. గతేడాది మంచి దిగుబడి రావడంతో రైతులు వేరుశనగ అధికంగా సాగుచేశారు.

– రవీందర్ వ్యవసాయశాఖ ఏవో

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి

ఇచ్చోడ: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఏఐసీసీ ఆదివాసీ కోఆర్డినేటర్ కోట్నాక్ తిరుపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్లమెంట్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆదిలాబాద్ మరింత అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా పనిచేసి పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకునే బాధ్యత తీసుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలోనే ఎన్నికల ప్రచారం ప్రారంభించారని గుర్తు చేశారు. ఇక్కడి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు జాంటి (ఖలీద్), కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బుర్గుల మల్లేశ్, భరత్ వాగ్మరే, ఎక్బాల్ పటేల్, కలీం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోట్నాక్ తిరుపతి

డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జీవన్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేసి, ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంచికట్ల ఆశమ్మ, గిమ్మ సంతోష్, వెంకట్‌రెడ్డి, గంగారెడ్డి, దేరా కృష్ణరెడ్డి, షకీల్, రఫీక్, షాకీర్, సమీ ఉల్లాఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ

తలమడుగు: మండలంలోని లింగి గ్రామంలో రూ. 5 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులకు సోమవారం జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి భూమిపూజ చేశారు. గ్రామాల అభివృద్ధికి ఎన్ఆర్ఈజీఎస్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్యాణ లక్ష్మి రాజేశ్వర్, ఎంపీటీసీ, వెంకన్న యాదవ్, గంగరాం, మోహన్, దేవన్న, విట్టల్, చిన్న పోచన్న, రామన్న పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని కోకస్‌మన్నూర్‌లో సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్ ఆధ్వర్యంలో రూ. 5 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. సీసీరోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, పట్ల గోవర్ధన్, గోప శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.